# కన్నీళ్ళతో కడవలు నిండితే!

కరెంటు పోయింది. ఇల్లంతా చీకటి. ఒకవైపు కిరసనాయిల్ లేక కుంపటి వెలిగించి వంట ప్రారంభించింది విజయ. అప్పటికే ఎనిమిది గంటలు దాటుతూంది. బెడ్ లైట్ కాంతిలో రేచీకటి మనిషిలా విజయ కాళ్ళకీ, చేతులకీ ఏదో అడ్డు పడ్డట్లు ఇటూ అటూ తిరుగుతూ వంట పూర్తి చేయటానికి తహ తహ లాడుతూంది. అసలే నెలాఖరు. ఇంట్లో సరుకులు నిండుకున్నా, అతిథులు మాత్రం తిష్ఠ వేసి కూర్చున్నారు.

అన్నం దించితే ఇంక కూర ఏం చేయాలో తెలియటంలేదు. వీళ్ళందరికీ భోజనం ఎలా పెట్టను, భగవంతుడా!

కన్నీళ్ళు చెంపలని తడుపుతూంటే కుంపటి దగ్గర మోకాళ్ళమీద తల పెట్టుకుని అలాగే కూర్చుంది. కుంపట్లో బొగ్గులు అంటుకుని చెళ్, చెళ్ అని రవ్వలు

విసురుతూన్నాయి. విజయ మనస్సుకూడా ఆ కుంపటిలా మండిపోతూంది. ఆ మంట బయటకి కనిపించనీయకూడదు. కనిపిస్తే అతిథులు ఇబ్బందిగా ఫీలవుతారుగా మరి. ఆలోచనల్లో ఉన్న విజయ, అన్నం మాడువాసన వేస్తున్నది గ్రహించేసరికి చాలా ఆలస్యమే అయింది. గిన్నె దించి కింద పెడుతూండగానే పక్క వాటాలోని ఇంజనీరుగారి విరజ - "ఆంటీ, మీకు ఫోను వచ్చింది" అంటూ కేక పెట్టింది.

"నాకా! ఫోనా! ఈ సమయంలోనా? రాంగ్ నంబరేమో చూడమ్మా" అంది ముఖం పమిటకొంగుతో తుడుచుకుంటూ.

"కాదు, ఆంటీ, మీకే. మేం సరిగ్గా కనుక్కున్నాం. ఎవరో మిమ్మల్ని 'తాజ్' నుంచి పిలుస్తున్నారు."

విజయ ఆశ్చర్యపోతూనే పక్క వాటాలోకి వెళ్ళింది.

"హలో, నేను విజయని మాట్లాడుతున్నాను."

"అరె విజ్జీ! నేను నేనే అబ్బ, నీ కోసం ఎంత దూరంనించి పరుగెత్తుకొచ్చానో తెలుసా!" అవతలినించి ఇంకా ఏదో వినిపిస్తూంది.

"ఎవరూ నే గుర్తించలేకపోతూ ఉన్నాను. ప్లీజ్ మీరు."

"ఛత్ ఏంటా నీరసం మాటలు? నువ్వు గుర్తుపట్టలేదూ నా గొంతు. నేనే లీలని. బొంబాయినించి వచ్చానే, బాబూ! మా శ్రీవారు ఇక్కడికి ఏదో కంపెనీ పనిమీద

వస్తాంటే, నేను నీ కోసం నిజంగా నిన్ను చూడాలని వచ్చాను. సరాసరి మీ ఇంటికే వద్దాం అనుకున్నాను. కానీ, మా శ్రీవారు ఒప్పుకోలేదు. విజ్జీ! నేను ఎంత కష్టపడి నీ అడ్రెస్ సంపాదించానో నీకు చెపితే నవ్వి నవ్వి చస్తావు. ఏం ఇప్పటికైనా నా గుర్తుపట్టావా, తల్లీ!"

"లీలా! నిజంగా నువ్వే అబ్బ, ఎన్ని సంవత్సరాలు అయిందే బాబూ, నిన్ను చూసి."

అప్పటివరకూ ఉన్న దిగులునీ, ఆర్థిక బాధలనీ క్షణం మరిచిపోయి ఆత్రతగా అడిగింది విజయ. విజయా, లీలా బాల్య స్నేహితులే కాదు, ప్రాణస్నేహితులు చిన్నప్పుడు. ఇద్దరూ ఒకేసారి స్కూలు ఫైనలు పాసైనారు. పెళ్ళిళ్లుకూడా రెండునెలల తేడాతో అయాయి విజయకి బి. ఎ. పాసైన మోహనకృష్ణతో పెళ్ళి అయింది లీల మాత్రం రెండో పెళ్ళివాడైన పెద్ద ఉద్యోగస్తుడిని పెళ్ళాడి బొంబాయి వెళ్ళిపోయింది. ఇరవై సంవత్సరాలన్నా లేని లీల, అప్పటికే నలభై అయిదు పైబడ్డ వెంకట్రావుని ఎలా పెళ్ళి చేసుకోవటానికి ఇష్టపడిందో. అప్పుడే కాదు, ఇప్పటికీ అర్థంకాదు విజయకి. లీలకి చిన్నప్పటినించీ డబ్బూ, హోదా, కారూ, నగలూ, చీరెలూ అంటే చచ్చేంత మోజు అని తెలుసు. అయినా, చూస్తూ చూస్తూ ముసలి వాడిని పెళ్ళాడటానికి ఒప్పుకున్నదంటే విచిత్రపోయిన విజయ లీల పెళ్ళికి వెళ్ళలేకపోయినా ఉత్తరం వ్రాసింది- అసలు కారణం చెప్పమని. కానీ, లీల ఆ విషయం వదిలి

మిగతా ఎన్నో విషయాలు వ్రాసి, అంతటితో స్నేహితు రాలికి ఉత్తరాలు బంద్ చేసింది. మళ్ళీ ఎనిమిది సంవత్స రాల తరవాత ఇప్పుడు ఇంత హఠాత్తుగా - నేను - లీలని అంటూ ఫోనులో పిలిచి విజయని ఆశ్చర్యంలో ముంచేసింది. లీల జీవితంలో మార్పు ఎక్కువ ఉందేమో కాని, విజయ అలాగే ఉంది. చాలీచాలని జీతం. ముగ్గురు పిల్లలూ, ఆర్థిక ఇబ్బందులూ, అతిథి దేవతలు. ఈ నాటి సామాన్య గృహిణికి మారురూపంలా ఉంది.

లీల అవతలినించి గడ గడా మాట్లాడేస్తూంటే, ఆలోచనలు కట్టిపెట్టింది.

"నీ కప్పుడే ముగ్గురు పిల్లలట కదూ, విజ్జీ! మీ శ్రీవా రెలా ఉన్నారు? ఎన్ని ప్రమోషన్లు కొట్టేశారు. స్కూటరూ, కారూ వగైరా ఏదైనా వాహనం కొన్నారా, లేక డొక్కు సైకిల్ తుడుస్తున్నాడా మీ ఆయన? ఇదిగో ఇలా ఎన్నని కబుర్లు ఫోనులో చెప్పను మే మిద్దరం భోజనం కానిచ్చి మీ ఇంటికి వస్తాం. ఈ లోపల మీ పనులు అన్నీ సర్దుకుని రెడీగా ఉండు, కబుర్లు చెప్పుకుందాం గాని, ఎంత పొద్దు పోయినా ఫర్లేదులే. శ్రీవారి డ్రైవింగ్ - కారు స్వంతం. హోటల్ రూము కొచ్చేస్తాం నీ ఇంట్లో ఒక్కరోజు ఉంటాంలే. కంగారుపడకు. అవునూ - ఇంతకీ అన్నీ నేనే మాట్లాడేస్తూన్నాను. మీ శ్రీవా రొచ్చారా ఇంటికి? మీ పుత్రరత్నాలు ఏం చేస్తున్నారూ? నీ వేం చేస్తున్నావూ."

విజయ నిర్లిప్తంగా నవ్వేసింది. కానీ, జవాబు చెప్పలేదు

"మీరా శ్రీవారింటికి వచ్చారా! లేక మా ఆయన లాగా క్లబ్బులూ, డిన్నర్లూ అంటూ అర్ధరాత్రికిగానీ ఇల్లు చేరుకోరా?"

మళ్ళీ నవ్వి ఊరుకుంది విజయ.

"ఏమిటా వెధవ నవ్వు. నీ నవ్వు వింటూంటే భయమేస్తోందే, విజ్జీ నీ ముఖం కనపడటం లేదనుకో. అయినా, నా నమ్మకం నీ భర్త ఉత్తముడనీ, ఏం నా అయిడియా కరక్టేనా?"

"........."

"అబ్బ, జవాబివ్వవేం? ఆయన్ని నే నింతవరకూ చూడలేదనేది మరిచిపోయినట్లున్నావు. ఆయన ఇంట్లో ఉంటే నా నమస్కారాలు అందించు.

"పోనీ పిలుస్తావా, మాట్లాడతాను."

"వద్దు! ఆయన నీ మాటలు వినే స్థితిలో లేరు. నమస్కారాలు రేపు అందిస్తాను."

"అంటే! అర్థంకాలేదు పోనివ్వు. మీకు వీలుంటే ఇప్పుడు తాజ్‌మహల్‌కి రండి, రూము నంబరు చెబుతాను. లేకుంటే మేం వస్తాం. పని పూర్తి చేసుకో. మరిచాను. విజ్జీ, పిల్లలని నిద్రపోనీయకు కాస్సేపు వాళ్ళతో ఆడుకోవాలని ఎన్నాళ్ళనుంచో కోరిక. మీ ఆఖరి వాడు 'సిసింద్రీ'లా ఉంటాడట కదూ. అమ్మ దగ్గరికి మొన్న

సంక్రాంతికి వెళ్ళినప్పుడు మీ తమ్ముడు వాళ్ళని గురించి ఒకటే కబుర్లు. ఆఁ ఇంతకీ మీ రిద్దరూ వస్తారా! మమ్మల్ని రమ్మన్నారా?"

విజయ గాభరా పడిపోయింది.

"లీలా! ప్లీజ్. ఇప్పుడు వద్దు రేపు పొద్దునే మీ రిద్దరూ రండి" అంది ఎలాగో గొంతు పెగల్చుకుని.

"ఏం! ఎందుకలా అదో మాదిరిగా మాట్లాడుతున్నావు? మీ శ్రీవారు రాత్రి మనుష్యులతో మాట్లాడరా?" నిష్ఠూరంగానే అంది లీల.

"అవును. మేం పగలు మనుష్యులం" పేలవంగా అంది విజయ.

"వాట్! పగలు మనుష్యులా? అంటే?"

"ఎంత మట్టిబుర్ర నీది! ఇంకా అర్థం చేసుకోలేదా!"

"ఊహూఁ పోనీగానీ నే రావటానికి నీ అభ్యంతరం ఏమిటో చెపితే వచ్చిన దారిన వెనక్కి వెళ్ళిపోతాను. నువ్వు మారావని తెలియదుగా."

"లీలా! నేను మారలేదు. పరిస్థితి బాగాలేదు. ఎందుకు నిన్ను రావద్దంటున్నానో చెప్పనా?"

"ఆఁ! అలా రా దారిలోకి. చెప్పు. శ్రద్ధగా వింటూన్నాను. నీ ఇష్టం. సరైన కారణం లేదా ఇప్పుడే వచ్చేస్తాను. శ్రీవారితో సహా ఏం?" బెదిరిస్తూంది లీల.

విజయ చెప్పటానికి ప్రయత్నిస్తూంది కానీ,దుఃఖంతో నోట మాట రావటంలేదు. లీల క్షణం ఆగి మళ్ళీ తనే మాట్లాడేస్తూంది.

"విజ్జీ! నీ గృహసీమ గురించి నా ఊహాచిత్రం ఎలా ఉందో చెప్పనా ముందు. విను. సరిగ్గా విను. పాలనురగ లాంటి తెల్లచీర కట్టుకుని, తలలో విచ్చిన మల్లెల మాల తురుముకుని దోమతెరదించిన పందిరిమంచంమీద ముఖమల్ దిండ్లని ఆనుకొని కూర్చుని తాంబూలం నములుతూన్న మీ శ్రీవారి గుండెలమీద ఒక చెయ్యిపెట్టి, ఎడం చేత్తో రిసీవర్ చెవిదగ్గర పెట్టుకొని నోటితో నాతో మాట్లాడుతున్నా, 'త్వరగా కానివ్వు నీ నెచ్చెలితో రాచకార్యం' అన్నట్లు కళ్ళతోనే సైగచేసే మీ శ్రీవారికి పెదవి విరిచి 'కాస్త ఆగండి' అని సైగ చేస్తూ...అన్నట్లు మీ ముగ్గురు బడుద్ధాయిలూ ఈ సరికి పెరుగుముద్దలు మింగి, నువ్వు పాడిన జోలపాటకి అలా అలా నిద్రాదేవి ఒడిలోకి వాలిపోయి అందమయిన కలలూ కంటూ వుంటారు కనక మీ ఇద్దరికీ ఇబ్బంది లేదు. ఇంక పానకంలో పుడకలా నేను వస్తాననేసరికి 'రావద్దు..రావద్దు... లీలా' అంటూన్నావు. అంతేకదూ! నా ఇమాజినేషన్ సెంట్ పర్సెంటు కరెక్ట్ కదూ!"

విజయ నవ్వలేక నవ్వింది. మళ్ళీ బిగ్గరగా నవ్వింది.

"అబ్బ! వినలేక చస్తున్నాను. ఏమిటా నవ్వు..."

"ఇదా...ఇది...ఏడవలేక నవ్వేనవ్వు లీలా! ఇంక చెపుతాను, విను. అంతా విన్నతరువాత నిజమో, కాదో అని చూడటానికి రాబోకు. లీలా, నే చెపుతున్నాను నా

స్థితి. విని భరించగలవా! నీవే చెప్పేవరకూ తప్పనిసరి పరిస్థితి కల్పించావు కనక చెప్పక తప్పదు, లీలా! శ్రీవారు ఇంత క్రితమే ఒళ్ళు తెలియని పరిస్థితిలో టాక్సీలో వచ్చి దిగారు. వాంతి చేసుకున్నారు కాబోలు. టెరిలీన్ పాంటూ, టెరీకాట్ షర్టూ ఖరాబై పోయాయి. ఆ అవతారంతోనే టాక్సీదిగి టాక్సీనెంబర్ నోటు చేసుకున్నారు. ఎందుకంటే, తన స్నేహితుడు మరొకడు ఈ ప్రపంచం తెలియకుండా దానిలోపడి వున్నాడు. అతను ఇలు సరిగాచేరినా, లేకున్నా నెంబర్ నోటు చేసుకోవటం. ఆ స్థితిలోనే లోపలికి టాక్సీ నంబర్ ఉంటే నయంకదూ! అందుకేనట వస్తూ ఆ రోజు వచ్చిన కొత్త అతిథులు-అంటే వారెలాంటి చుట్టాలో చెప్పనా? మా తోటికోడలి బావగారి ఆడబిడ్డ కోడలి తమ్ముడూ, మరదలూ, వారి నలుగురి పిల్లలూ, అ పిల్లలకి అమ్మమ్మా. ఆ ముసలావిడకి ఎవరో చెప్పారట పట్నం ఆసుపత్రిలో ఆపరేషన్‌చేస్తే నీ కళ్ళు నిక్షేపంలా వచ్చి చూపు బాగా కనిపిస్తుం'దని. అంతే. ఆవిడ ఒక్క క్షణం ఆగకుండా పట్నంలో ఎలాగో మన చుట్టాలమ్మాయి విజయ వుందిగా అని వీరందరినీ వెంటపెట్టుకు వచ్చేసింది. వీరుకాక, అంత క్రితమే నాలుగు నెలలుగా వున్న ఆడబడుచు కొడుకు, ఉద్యోగాన్వేషణకోసం మా శ్రీవారి అన్నగారి కూతురు, ఏదో పరీక్షకోసం ఈ ఊళ్ళోనే వున్న మేనత్త కూతురు మమ్మల్ని పరామర్శించం కోసం వేంచేశారు. లెక్క పెడితే అంతా కలిపి పదహారు మంది ఉన్నారు. మా కున్నది రెండు గదుల అద్దెకొంప.

ఇంక మా శ్రీవారు ఈ అతిథులని, 'ఇహిహి హి...' అంటూ పరామర్శించి, తూలుతూ గదిలోకి వచ్చారు. శ్రీవారి వాలకాన్ని, అతిథులు మెడలు మూరెడు పొడుగున వంచి మరీ చూస్తూన్నారు. ఆయన గదిలోకి రాగానే ఇప్పటి వరకూ మెడవరకూ దుప్పటి కప్పుకుని పాఠం వల్లెవేస్తూన్న పెద్దవెధవ లిద్దరూ చటుక్కున కళ్ళు మూసుకున్నారు, తండ్రిని ఆ స్థితిలో చూడలేక. ఇంక మూడోవాడు గడుగ్గాయిలే-వాడు అన్న దుప్పట్లో దూరినా, తండ్రి స్థితిని దొంగవాటుగా చూస్తూన్నాడు. ఇంక శ్రీవారు కొత్తసరుకు రుచి చూశారో లేక డోస్ ఎక్కువయిందోగానీ, మరోసారి భళ్ళున వాంతి చేసుకొన్నారు. పెద్దవాళ్ళిద్దరూ గాభరా పడిపోయి లేచి కూర్చున్నాను. మూడోవాడు ఏడుస్తూ లేచి తప్పటడుగులు వేస్తూ వచ్చి, 'వాంతి' లో కాలు జర్రున జారిపడి లబో దిబో అంటున్నాడు. వంట యింట్లో కుంపటిముందు కూర్చున్నాడు ఏం చేయాలో తెలియక. నీళ్ళచుక్కలేదు ఇంట్లో. రోజు మొత్తంమీద అర్ధగంట కూడా రాదు కుళాయి. చుట్టుపట్ల భావి అనేది లేదు. ఈ స్థితిలో వున్నాను నేను.

ఇంక శ్రీవారు తన లుంగీ కనిపించలేదని చిందులేస్తూన్నారు. ఆ లుంగీ కాస్తా చెప్పకుండా ఆడబడుచుకొడుకు కట్టేసుకున్నాడు. నే నేంచేయను? మరోటి లేదు. ఈ స్థితిలో చిందులు తొక్కినా ప్రయోజనం లేదని గ్రహించి కాబోలు వంకీనున్న నా తెల్లచీర అది లుంగీయో, చీరో తెలుసుకు

నేంత ఓపిక లేక కాబోలు-దొరగారు అదే చుట్టుకొని మంచానికి అడ్డంగా పడ్డారు. ఇంక తెల్లవారేవరకూ పర్లేదు ఆయన కళ్ళు తెరవరు, నోరు మెదపరు. ఇందుకే అన్నానే - వీళ్ళు పగలు మనుష్యులని. ఆయనయితే పడుకున్నారు కానీ, మరి నేను-ఈ గతి ఎలా శుభ్రం చెయ్యను? ఒక్క నీటిబొట్టుకూడా లేదే... ఇంక అతిథి దేవతలకి ఏం పెట్టను? ఏం చెయ్యను?"

లీల జవాబివ్వలేకపోతూంది. కన్నీళ్ళు తిరుగుతూన్నాయి.

"లీలా! నేను అతిథుల అన్నం మాట మరచి నిద్రపోయానేమో అని కాబోలు పెద్దగా ఆవులిస్తూనూ, సకిలించి గొంతులు సరిచేసుకుంటూనూ వారి ఆకలిని, నా కర్తవ్యాన్నీ గుర్తుచేస్తూన్నారు. భారత స్త్రీ ఎన్ని బాధల్లో వున్నా, ఎలాంటి పరిస్థితిలో వున్నా ఇంటికి వచ్చిన అతిథిని అగౌరవపరిచే స్థితికి రాలేదింకా అనుకుంటాను. మనకి లేకున్నా, వచ్చినవాళ్ళకి పెడతాంకదూ! పిల్లల నోళ్లుకూడా నొక్కి అతిథులకి విందుచేయటం మన అలవాటేకదూ! ఇది ప్రతి గృహిణికీ ఉన్న సమస్యే. పాపం, చుట్టా లేం చేస్తారు? అవసరాలు తీరగానే వెళ్ళక మనఇళ్ళలో ఉండిపోరు కదూ. నిజమే ఒకరికి ఒకరం సాయపడవలసిందే కానీ, ఈనాడు సమాజ పరిస్థితిలో అతి సామాన్య గృహిణి ఈ ఆచారాలని గౌరవించే శక్తిలేక, అలా అని ఉదాసీనం సహించలేక ఆడకత్తెరలో పోకలా నలిగి బలి అయిపోతోంది ఏమంటావు? పాలకి యిబ్బంది. పంచదార దొర

కదు. బియ్యం ఖరీదు పెరిగింది. ఇల్లు ఇరుకు. అవన్నీ వదిలినా నీళ్ళు...నీళ్ళు. మనిషికి అతిముఖ్య అవసరమయిన నీళ్ళకే కరవైతే...ఎలా బతికేది? చెప్పు, లీలా! ఎలా బతికేది? వీళ్ళకి నేనీ రాత్రి భోజనం ఎలా పెట్టేది? ఆ గదిని ఎలా శుభ్రంచేసేది? చెప్పవే...చెప్పు?

ఈ సమాజంలో స్త్రీలే త్రాగుడు అలవాటు చేసుకుంటూ నాగరికత అని మురిసిపోతోంటె ఇంక పురుషుడి సంగతివేంచెపుతాం లే! ఈ వ్యసనానికి డబ్బు మరెలావస్తుందో తెలియనే తెలియదు నాకు.

లీలా! ధనవంతుల విషయం వదులు. కానీ, మధ్యతరగతి, రోజు కూలీతో బతికే కష్టజీవులసంగతే నే చెప్పేది. ఎన్ని సంసారాలు ఈ వ్యసనం ఉన్నందువల్ల నాశనం అయిపోతున్నాయో తెలుసా? నూటికి 75 కుటుంబాల స్థితి ఇదే విధంగా వుందని నా ఉద్దేశ్యం. దీనికి పరిష్కారం లేదా? ఇదీ...ఎవరికి వారు ఆలోచించుకుని ఈ దురలవాటునుంచి బయటపడగలగాలి గానీ, మరొకరు చేయగలిగిందేం వుంది? లీలా! నే నీ విషయంలో బాధపడేది నా ఒక్కదానికోసం కానేకాదు. పిల్లలకోసం. పిల్లలు తండ్రి నీ స్థితిలో చూసి ఏవగించుకోరూ? పెద్దవాళ్ళయితే వాళ్లూ ఈ స్థితిలోకి రారూ? చెప్పు, లీలా! పిల్లలమీద నా కెన్నో ఆశలున్నాయి. వాళ్ళ భవిష్యత్తు ఏమైపోతుందో అనే నా బాధ. తండ్రి ఈ విషయాలు గుర్తు ఉంచుకోవద్దూ?"

"విజ్జీ! నువ్వు చెప్పేదంతా నిజమే. ఈ నాడు సమాజంలో ఫాషన్‌గా కొందరూ, కావాలని కొందరూ, స్నేహితులవల్ల మరికొందరూ ఈ అలవాటుకి లోనవుతున్నారు. అయితే, ఏ అలవాటయినా లిమిటులో ఉంటే ఫర్వాలేదు-వ్యసనంగా మారితేనే చిక్కు."

విజయ బిగ్గరగా నవ్వింది మళ్ళీ.

"లీలా! ఏదైనా చెప్పు. నేనిది సహించలేని విషయం. ఆ స్థితిలోని తండ్రిని చూసి భయంగా ఉన్న పిల్లల ముఖాలు గుర్తుకొస్తూంటే నా గుండె మండిపోతోంది. నా చేతిలో కనక తుపాకీ ఉంటే ఈలాంటి బాధ్యతారహితులని వరసగా నిలబెట్టి కాల్చేసాను. ఇలాంటివాళ్ళ వల్లనే పిల్లలు కూడా చెడిపోయేది. ఈలాంటి దరిద్రులు సమాజానికి చీడపురుగులు. వెధవలు..." ఆవేశంగా మాట్లాడుతూంది విజయ.

చుట్టాలు ఒక్కొక్కరూ ఇటూ, అటూ పచార్లు చేస్తూ చెవులు దోంపెట్టి మరీ వింటూన్నారు. మళ్ళీ విజయ మాట్లాడుతూంది.

"లీలా! నే నీ స్థితిలో జీవిస్తూన్నాను. అందుకే నిన్నిప్పుడు రావద్దన్నాను. ఎన్నో సంవత్సరాల తరవాత కలుసుకోవాలని వచ్చిన నిన్ను నా అశాంతితో బాధిస్తే క్షమించు. రేపు తప్పక రా. వస్తావుకదూ?" విజయ పొంగి పొర్లి వచ్చే దుఃఖాన్ని బలవంతంగా మింగుతూ అంది.

"విజ్జీ! నీ పరిస్థితి ఇప్పుడర్థమైంది. సారీ...పరిస్థితులు

ఒకోక్కసారి ఇలాగే చుట్టిముట్టి సహనాన్ని పరీక్షిస్తాయి. బాధపడకు. రేపు తప్పకుండా వస్తానుగా. నీకు యిబ్బంది కలిగించినందుకు నన్నే క్షమించు అరే...ఏడవకే..."

లీల ఓదార్పు మాటలు విజయలోని దుఃఖాన్ని రెట్టింపు చేసింది.

"లీలా! ఇప్పటి నా స్థితి మరే స్త్రీకి కలిగించవద్దని భగవంతుడిని ప్రార్థిస్తూన్నాను. కాదు - విధాతని శపిస్తూన్నానుకూడా! ఎందుకంటావా?

ఆడదానికి కన్నీళ్ళు యెలాగూ వరంగా యిచ్చాడు కదా!

ఈ కన్నీళ్ళతో కడవలు నిండితే ... ఈ అత్యవసర పరిస్థితిలో వాటిని ఉపయోగించుకొని నీటి ఎద్దడి నిలచి విముక్తిపొంది ఉండేదాన్ని కదా! ఇల్లు శుభ్రంచేసుకొనే దాన్ని. అతిథులకి దాహం తీర్చేదాన్ని. శ్రీవారికి స్నానం చేయించేదాన్ని. పసివాడికి తలంటిపోసేదాన్ని. ఇంకా, ఇంకా యెన్నో చేసేదాన్ని. లీలా! నీళ్లు లేక యెండి బీడులుగా మారిపోయే భూదేవిని..."

"విజయా! నీకు మతిపోలేదుకదా! ఏమిటా మాటలు!"
లీల ఖంగారుగా అంది.

"మతే కనక పోయివుంటే యెంతో బాగుండేది. కానీ, నాకు ఆ అదృష్టంకూడాలేదు లీలా! నువ్వెన్నన్నా

చెప్పా. ఈ తాగుడు అనే వ్యసనం మనిషిని పశువుని చేసేస్తుంది. ఇదే చివరకు మనిషిని మృత్యురూపంలో మింగేస్తుంది. నూర్యాపేటలో జరిగిన సంగతి బహుశా పేపర్‌లో చూసేవుంటావు. దాదాపు డెబ్భయి ముగ్గురిని కాబోలు పొట్టన పెట్టుకుంది. నే చెప్పేది నిజం కదూ. ఈ సంఘటనలో ఎన్ని కాపురాలు...వీధిపాలైనాయో! అయ్యో! లీలా, మా శ్రీవారు మళ్ళీ వాంతి చేసేసుకుంటున్నట్లున్నారు. నే పోతున్నా.."

ఇంక ఒక్క మాటకూడా వినిపించలేదు లీలకి, ఫోను పెట్టేసిన శబ్దం తప్ప.

తను కూర్చున్న హోటలు రూము, ఖరీదైన సోఫా సెట్టు, దోమతెర మంచం, మెత్తనిదిళ్ళు, ఒంటిమీదవున్న ఖరీదయిన పారిన్ నైలెక్సు చీర, అంతక్రితం స్నానంచేసిన టబ్, ఖరీదయిన ఫేస్‌పౌడరు వాసనా, అంతవరకూ సగం ఖాళీచేసిన స్కాచ్ విస్కీ గ్లాసు గిరగిరా తిరుగుతున్నాయి లీల కళ్ళముందు. మెడలో ఖరీదయిన నెక్లెస్ గుచ్చుకొని బాధ పెడుతూన్నట్లుంది.

విజయకి బిందెడు నీళ్ళుకాదు, గ్లాసుడు దొరకడం కూడా ఎంత కష్టంగా ఉంది! కానీ, నాకు...ఇక్కడ పంపు తిప్పితే ధనధనా ధార వాష్‌బేసినులో పడి తెలియని దార్ల గుండా పరుగులు పెడుతూంది. ఈ సుఖం అంతా ఎలా వస్తూంది? డబ్బులోనుంచి. అవును, నిజం. డబ్బు...అందు

కేగా ఈ సుఖాలకి ఆశపడి ముసలి మొగుడిని చేసుకుంది! అయితే, ఈ డబ్బూ, హోదా, చీరలూ, నగలూ, కార్లూ, టూర్లూ - ఇవన్నీ కొన్నాళ్ళకే మొహం మొత్తాయి. ఇప్పుడు ముసలిమొగుడు భూతంలా కనిపిస్తూన్నాడు. కానీ, తప్పదు. ఏది కావాలో తెలియని స్థితిలో ఈ పెళ్ళికి ఒప్పుకుని, ఈ సుఖాలనీ, సంతృప్తినియ్యక అశాంతితో వేగిపోయి, అది మరచిపోవటానికి ఇంక యీ వ్యసనంకూడా అలవాటు చేసుకున్నాను. అయితే...ఇది మంచిదా! కాదని ఎన్నో సంఘటనలు చెపుతూనే ఉన్నాయి. మొన్న మొన్న జరిగిన సూర్యాపేట సంఘటన చాలు.

'ఊఁ' అనుకుంటూ తల విదిల్చి, ఇంక ఆలోచనలు కట్టిపెట్టి మనస్సుని మరో వైపుకి మళ్ళించే ప్రయత్నం చేస్తూంటే, తన భర్త లెదర్ కేస్ కనిపించింది. దానినిండా వందరూపాయలనోట్ల కట్టలే. "డబ్బు వుంటే కొండమీద కోతి దిగివస్తుంది అనేది అమ్మమ్మ. కానీ, కొన్ని సంవత్సరాలిలా వర్షాలు పడకపోతే, ప్రకృతి మానవుడిమీద అలిగితే.. అప్పుడు...అప్పుడీ నోట్లు నీళ్ళని సృష్టించగలవా! 'కన్నీళ్ళతో కడవలు నిండితే' అన్న విజయమాట పదేపదే గుర్తుకొస్తూంది. అబ్బ, ఇంత కష్టాలా! ఛీ..." ఆలోచించే శక్తికూడా లేని లీల చేతిలోని గ్లాసు నోటి దగ్గర పెట్టుకోబోయింది. కానీ, ఆ గ్లాసులో ఉన్న ద్రవంలోనించి విజయ

తుపాకి సూటిగా తనవైపే గురిపెట్టి నిలుచున్నట్లు కనిపించి “కెవ్వు” మంది. గ్లాసు కిందపడి ముక్కలైంది.

“లీలా! ఏమైంది డియర్?” అంటూన్న ముసలి మొగుడికి జవాబు చెప్పేందుకు కూడా శక్తి లేనిదానిలా ఖరీదైన మెత్తని సోఫా మీదికి ఒరిగిపోయింది. కళ్ళు మూసుకున్నా, విజయే కనిపిస్తూంది లీల కళ్ళకి.